క్లుప్తంగా

స్టోర్ డీలర్‌పై ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్డుదారులు

ఓడీచెరువు : రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలు, ప్రశ్నించిన వారిపై దూషణలకు దిగుతున్నారని ఎద్దులవారిపల్లి 29వ నంబర్ (స్టోర్) చౌకధాన్యపు డిపో డీలర్ గంగాద్రిపై కార్డుదారులు మంగళవారం తహసీల్దార్ శ్రీనివాస రెడ్డికి ఫిర్యాదు చేశారు. డీలర్‌కు డివైజ్ ఎలా వాడాలో తెలియదని, పక్క గ్రామం నుంచి ఆయన కుమార్తె వచ్చే వరకు కార్డుదారులందరూ ఎదురు చూడాల్సి వస్తోందని తెలిపారు. 5 కిలోల బరువుగల డబ్బాతో బియ్యం తూకం వేసి.. కోత విధిస్తున్నారని, ఇదేమని ప్రశ్నిస్తే దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఆడవారిని సైతం అసభ్యపదజాలంతో దూషిస్తారని ఆరోపించారు. విచారణ చేపట్టి డీలరుపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు అందజేసిన వారిలో నాగేంద్ర, కవిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులను సత్కరిస్తున్న దృశ్యం

నల్లచెరువు: అల్లుగుండు గ్రామ సచివాలయం నుంచి బదిలీ అయిన ఉద్యోగులకు టీచర్ సూర్య నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత అలీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారి సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘునాథ గుప్తా, ఏఓ రామక్రిష్ణ, ఈఓఆర్డీ శకుంతల, పంచాయతీ కార్యదర్శులు నాగేశ్వర్‌రెడ్డి, విజయ్ కుమార్ గ్రామస్తులు పాల్గొన్నారు.

'సేంద్రియం' వైపు రైతులు ఆసక్తి చూపాలి



మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధి మేరి వటమట్టమ్

చెన్నేకొత్తపల్లి : సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి చూపాలని టింబక్టు కలెక్టివ్ సంస్థ వ్యవస్థాపకులు మేరీ వటమట్టమ్ రైతులకు సూచించారు. మండల కేంద్రంలో టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న ధరణి సంఘం 17వ వార్షిక మహాసభ మంగళవారం జరిగింది. ఈసందర్భంగా మేరీ వటమట్టమ్, బబ్లూ గంగూలీ మాట్లాడుతూ రసాయన ఎరువుల ద్వారా పంటలను సాగు చేయడం వలన భూమి సారవంతం కోల్పోతుందన్నారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా చిరుధాన్యాలను సాగు చేయాలన్నారు. సేంద్రియ పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. ఈ సందర్భంగా రైతులను సన్మానించారు.

సకాలంలో సస్యరక్షణ చేపట్టాలి

కనగానపల్లి: వేరుశనగ పంటలో చీడపీడల నివారణ కోసం రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ లక్షణ్‌నాయక్ సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్‌లో సాగుచేసిన వేరుశనగ పొలాన్ని పరిశీలించారు. పంటకు ఆశించిన ఆకుముచ్చ, ఎండు తెగులు నివారణ కోసం చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు.

మెరుగైన వైద్యం అందించాలి

కదిరి టౌన్: కదిరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ వైద్యులకు సూచించారు. మంగళవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆస్పత్రికి సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శర్మ, డీసీహెచ్ఎస్ డాక్టర్ మధుసూదన్, ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి, వైద్యులు హుస్సేన్, శంకరయ్య, కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

స్వీపర్ కుటుంబానికి సాయం



మృతుని భార్యను ఓదారుస్తున్న కోటి సురేష్

బత్తలపల్లి: మండల కేంద్రంలో పంచాయతీ కార్యాలయ స్వీపర్ బోయ నరసమ్మ భర్త బోయ ముసలప్ప అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్, ఉప సర్పంచ్ కోటి గోపీనాథ్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

వైద్య సేవలు అంతంతే

- వైద్య సిబ్బంది కొరతతో ఇబ్బందులు
- ఒకే డాక్టర్‌తో పూర్తిస్థాయిలో అందని సేవలు
- ఇదీ పట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దుస్థితి

కదిరి అర్బన్: సిబ్బంది కొరతతో వైద్య సేవలు కుంటుపడుతున్నాయి. సకాలంలో సేవలందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. కదిరి మండల పరిధిలోని 14 పంచాయతీల పరిధిలోని ప్రజలకు పట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సేవలందిస్తోంది. ఇక్కడ ఇదివరకు ఇద్దరు డాక్టర్లు వినోద్, ప్రమీల ఉండేవారు. రోజూ 60 మందికి ఔట్ పేషెంట్ (ఓపీ) సేవలు అందిస్తారు. అయితే వీరిలో డాక్టర్ ప్రమీల ఇటీవల బదిలీల్లో భాగంగా కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఈస్థానాన్ని భర్తీ చేయలేదు. దీనికితోడు ప్రైమరీ హెడ్ నర్స్ పోస్టు కూడా ఖాళీ ఉంది. గతంలో ఇద్దరు డాక్టర్లలో ఒకరు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి 104 వాహనం ద్వారా వైద్యసేవలందించేవారు. ఒకరు ఆస్పత్రిలో ఓపీ చూసుకునేవారు. ప్రస్తుతం ఉన్న ఒక్క డాక్టర్ ఓపీ చూస్తున్నారు. ఆయన సెలవు పెడితే ఇక నర్సులే దిక్కు. ప్రస్తుతం 104 వాహనం వద్ద ఆ వాహన సిబ్బందే చూసుకుంటున్నారు. రాత్రిపూట ఒక నర్సు మాత్రమే ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి, అపరాత్రి ఏదైనా అత్యవసరం వైద్యం కావాలంటే కదిరికి రావాల్సిందే. రాత్రి పూట ఒకరు, పగలు ఒకరు ఇలా ఇద్దరు డాక్టర్లను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.



పట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

రాత్రిపూట విధుల్లో డాక్టర్ ఉండాలి



పట్నం ఆస్పత్రిలో రాత్రిపూట కూడా డాక్టర్ అందుబాటులో ఉండేలా చూడాలి. ఎందుకంటే రాత్రి సమయాల్లో పాముకాటు బాధితులు, ప్రసవాల కోసం గర్భిణులు వస్తుంటారు. ఆ సమయంలో డాక్టర్ అందుబాటులో ఉంటే ప్రజలకు ధైర్యంగా ఉంటుంది. కదిరి ఆస్పత్రికి వెళ్లేందుకు పేదలకు వాహన సౌకర్యాలు ఉండవు. ఉన్నతాధికారులు రోగుల ఇబ్బందులను అర్థం చేసుకుని వైద్యులు, సిబ్బందిని కేటాయించాలి.

– లక్ష్మీనరసమ్మ, పట్నం

త్వరలోనే నియమిస్తాం



పట్నం పీహెచ్‌సీకి త్వరలోనే డాక్టర్‌ను నియమిస్తారు. ఉదయం 9 నుంచి సాయంత్ర 4 గంటల వరకు అక్కడ డాక్టర్ విధులు నిర్వహిస్తారు. రాత్రిపూట ఆన్‌కాల్ డ్యూటీపై వెళ్లి సేవలందిస్తారు. మరొక డాక్టర్ 104 వాహనం వద్ద వైద్య సేవలు అందిస్తుంటారు.

– నాగేంద్రనాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, పీడీ

ధర్మవరం అర్బన్: రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ధర్మవరం విద్యార్థులు ఎంపికయ్యారని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామక్రిష్టప్ప, ఫిజికల్ డైరెక్టర్ నాగేంద్ర తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం న్యూటౌన్ జూనియర్ కళాశాలలో బాల్ బ్యాడ్మింటన్ అండర్‌-16 బాలుర ఎంపికలు నిర్వహించగా ధర్మవరం విద్యార్థులు మనోజ్‌కుమార్, అశోక్, సాయిప్రసాద్ ఎంపికయ్యారన్నారు. త్వరలో ప్రకాశం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా తరపున వీరు పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు ప్రకాష్, శ్రీనివాసులు, నాగేంద్ర, లలితమ్మ, నాగరాజు, రామంజినేయులు తదితరులు అభినందించారు.

ఆర్డీటీ సంస్థకు అండగా నిలుద్దాం



మాంఛో ఫెర్రర్‌ను కలిసిన దళిత, వికలాంగ సంఘాల సభ్యులు

కనగానపల్లి: పేద ప్రజలకు సేవలందిస్తున్న ఆర్డీటీ సంస్థకు ప్రతి ఒక్కరూ అండగా నిలుద్దామని మండల దళిత సంఘం నాయకులు తెలిపారు. ముక్తాపురం, మామిళ్లపల్లి, కోనాపురం, కుర్లపల్లి గ్రామాలకు చెందిన దళిత, వికలాంగ సంఘాల నాయకులు, సభ్యులు మంగళవారం మామిళ్లపల్లిలోని ఆర్డీటీ ఏరియా కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ నిరంతరంగా సేవలందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్ఏను రెన్యూవల్ చేయాలని కోరారు. అనంతరం వారు అనంతరంలోని ఆర్డీటీ కార్యాలయంలో సంస్థ ప్రోగ్రాం డైరక్టర్ మాంఛో ఫెర్రర్‌ను కలిసి తమ మద్దతును తెలియజేశారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు నరిసింహమూర్తీ, ఓబుళపతి, పెద్దన్న, ప్రభాకర్, ప్రసాద్, నరసమ్మ, వికలాంగుల సభ్యులు భాస్కరరెడ్డి, ఓబిలేసు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ రవినాయక్

చెన్నేకొత్తపల్లి: విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల వైద్యాధికారి డాక్టర్ రవి నాయక్ కస్తూర్బా పాఠశాల సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన పాఠశాలను తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలలోని విద్యార్థినులు ఉండే గదులను పరిశీలించారు. రాత్రి సమయంలో ఇక్కడ ఉండే వారు దోమకాటుకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులకు వడ్డించే భోజనాన్ని, వంటగది, డైనింగ్ హాల్‌ను క్షుణ్ణంగా పరిశీంచారు. వంటగదిని శుభ్రంగా ఉంచుకోవాలని వంట చేసే వారు పరిశుభ్రత పాటించాలని అక్కడి సిబ్బందికి సూచించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ సువర్ణ, వైద్య సిబ్బంది ఉన్నారు.

ప్రజల సహకారం అవసరం



అధికారులకు సూచనలిస్తున్న డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

ధర్మవరం అర్బన్: నాటుసారా రహిత గ్రామాలు తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని అనంతపురం ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, పుట్టపర్తి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహులు తెలిపారు. ధర్మవరంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను మంగళవారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం ఎక్సైజ్ సీఐ చంద్రమణి, ఎస్ఐ చాంద్‌బాషా, నాగరాజు, సిబ్బందితో మాట్లాడారు. నాటుసారా నిర్మూలన కోసం ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా ఉంచి దాడులు నిర్వహించాలని సూచించారు. నవోదయం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి నాటుసారా తయారీ చేయకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో జలధికి గంగమ్మ తల్లి



గంగమ్మ తల్లి ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

తాడిమర్రి: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో గంగమ్మ తల్లికి గ్రామస్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో జలధి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆలయంలో పూజారి చాకలి అంకప్ప ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను వెండి గొడుగులు, వివిధ రకాల పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేళతాలాల నడుమ గంగమ్మ తల్లి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు అమ్మవారికి కొబ్బరి కాయలు కొట్టి పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు ఉత్సవ విగ్రహాలను జలధికి తీసుకెళ్లారు.

యల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



కునుకుంట ఆలయ ఆవరణలో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌తో మాట్లాడుతున్న కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

తాడిమర్రి: కునుకుంట్ల లోని యల్లమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ముదిగుబ్బ మండలం మల్లమ్మ కొట్టాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు రాగే శ్రీరాములు నిర్వహించిన శుభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, ముదిగుబ్బ మండల నాయకులు ఇందుకూరు నారాయణరెడ్డి, ధర్మవరం రంగారెడ్డి తదితరులు కూడా కార్యక్రమానికి హాజరయ్యారు.

వైఎస్సార్‌సీపీ నేత కుటుంబానికి పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మక్బూల్ అహ్మద్

తలుపుల : కుర్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి కుర్లి శివారెడ్డి తండ్రి వెంకటమల్లారెడ్డి (80) మంగళవారం చనిపోయాడు. విషయం తెలుసుకున్న కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బి.ఎస్.మక్బూల్ అహ్మద్ గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుర్లి శివారెడ్డిని పరామర్శించారు. వీరితో పాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసులు రెడ్డి, మాజీ మంత్రి షాకీర్, మాజీ జెడ్పీటీసీ సురేంద్రారెడ్డి, యువజన విబాగం నాయకులు రమేష్, నాయకులు సమీర్, సాయినిఖిల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు ఎనలేనివి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న టీచర్లు, విద్యార్థులు

పుట్టపర్తి టౌన్: విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయుల సేవలు ఎనలేనివని మండల విద్యాశాఖ అధికారి గోపాల్‌నాయక్, మోహన్‌బాబు పేర్కొన్నారు. బుక్కపట్నం మండలంలో పనిచేస్తూ బదిలీ, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు నార్శింపల్లి మండల పరిషత్ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం యేర్పాటు చేశారు. పదోన్నతి పొందిన కోనంకి చంద్రశేఖర్, సత్యనారాయణరెడ్డి, బదిలీ అయిన సుధాకర్, ఓబుళపతిని ఉపాధ్యాయులు విద్యార్థులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఎంఈఓలు గోపల్‌నాయక్, మోహన్‌బాబు, పలువురు ఉపాధ్యాయులు హాజరై వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, ప్రమీలమ్మ, ఆస్మాబేగం, మధుసూదన్‌రెడ్డి, నాగానంద తదితరులు పాల్గొన్నారు .

ఉద్యోగులతో సమీక్ష

బత్తలపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ నరసింహనాయుడు అధ్యక్షతన సచివాలయ కార్యదర్శులు, ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పీ–4 సర్వేలో బంగారు కుటుంబాలకు మార్గదర్శకుల ద్వారా లబ్ధి, బయోమెట్రిక్ హాజరు, తల్లికి వందనం, సిటిజన్ ఈ–కేవైసీ రిపోర్టు, మనమిత్ర, ఐవీఆర్ఎస్ కాల్స్, స్వచ్ఛంధ్ర–స్వర్ణాంధ్ర, ప్లాంటేషన్ తదితర అంశాల ప్రగతిపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి శ్రీనివాసులు, ఉప మండల పరిషత్తు అభివృద్ధి అధికారి క్రిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు డ్యామేజీపై కేసు

కొత్తచెరువు: రోడ్డు డ్యామేజీపై కేసు నమోదైంది. మండలంలోని ఇరగలపల్లి నుంచి తలమర్లకు నాబార్డ్ నిధులతో వేసిన తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే ఇరగలపల్లి రైతులు అంకె ఆంజనేయులు, అంకె నాగభూషణ, అంకె వెంకటనారాయణ, అంకె వెంకటరాముడు దాదాపు 250 మీటర్ల పొడవు మేర మట్టి, మెటల్‌ను తొలగించారని, దీంతో రూ.2,50,000 నష్టం కలిగిందని కాంట్రాక్టర్ రమణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ మారుతీశంకర్ మంగళవారం తెలిపారు.

గణితంపై అవగాహన



గణిత శాస్త్రం ప్రాధాన్యత గురించి వివరిస్తున్న విద్యార్థులు

ధర్మవరం రూరల్: పట్టణంలోని రిషి పాఠశాలలో మంగళవారం అప్రాక్సిమేషన్ డే సందర్భంగా విద్యార్థులకు గణిత శాస్త్ర ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ భాస్కర్, సీఏఓ రవీంద్ర, ప్రిన్సిపాల్ కరణ్ స్వరూపా సింగ్, వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణి పాల్గొన్నారరు.

అచ్చెన్న వ్యాఖ్యలు చేతకాని పాలనకు నిదర్శనం

ధర్మవరం: ఆడబిడ్డ నిధి పథకం కింద 18 నుంచి 59 ఏళ్లలోపు మహిలలకు ప్రతి నెలా రూ.1500 ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు కూటమి ప్రభుత్వ చేతకాని పాలనకు నిదర్శనమని వైఎస్సార్‌సీపీ మున్సిపల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందమూరు నారాయణరెడ్డి అన్నారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీలను తూచా తప్పకుండా అమలు చేసి అర్హులందరికీ లబ్ధి చేకూర్చారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం హామీల అమలులో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. .

ఉపాధి పనులపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

కదిరి టౌన్: ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో చేపట్టిన పనులపై విజిలెన్స్ అధికారులతో విచారణ చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కదిరప్ప డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కదిరిలోని సీపీఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో అధికారులు, అధికార పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఏక పక్షంగా ఉపాధి హామీ పనులు చేపడుతున్నారన్నారు. బోగస్ మస్టర్లతో నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని పీడీని కోరారు.

చెన్నారెడ్డికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న చెన్నారెడ్డి

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకుడు బి.చెన్నారెడ్డికి కడప యోగి వేమన విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ డాక్టరేట్ ప్రదానం చేసింది. రిటైర్డ్ ప్రొఫెసర్ జి.సాంబశివారెడ్డి పర్యవేక్షణలో 'మెడిసిన అండ్ పబ్లిక్ హెల్త్ ఇన్ ది కలోనియల్ మద్రాస్ ప్రెసిడెన్సీ' అన్న అంశంపై రీసెర్చ్ చేసినందుకు ఆయనకు డాక్టరేట్ ఇచ్చారు.

అచ్యుతానందన్‌కు ఘన నివాళి

కదిరి టౌన్: అనారోగ్యంతో మృతి చెందిన కేరళ మాజీ సీఎం వీఎస్ అచ్యుతానందన్ మృతికి సీపీఎం ఘనంగా నివాళులర్పించింది. మంగళవారం కదిరిలోని సీపీఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులు జీఎల్.నరసింహులు మాట్లాడుతూ అచ్యుతానందన్ రాజకీయ చరిత్రలో బలమైన శక్తిగా, దేశ వామపక్ష ఉద్యమంలో అత్యున్నత నాయకుల్లో ఒకరిగా కీర్తి గడించారన్నారు. కార్యక్రమంలో సీపీఎం కదిరి ప్రాంతీయ కార్యదర్శి జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్లేట్ల వితరణ



ప్లేట్లు అందిస్తున్న హెచ్ఎం, పూర్వ విద్యార్థులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సుందరయ్యనగర్ మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు భోజన సౌకర్యార్థం పూర్వ విద్యార్థులు (2013–14 బ్యాచ్) మహేశ్వర్‌రెడ్డి, నరేష్, సాయికుమార్ 200 ప్లేట్లను వితరణ చేసినట్లు హెచ్ఎం రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మయ్య, రాంప్రసాద్, రామకృష్ణ, రామంజినేయులు, ఓబిలేసు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

చెన్నేకొత్తపల్లి: చిన్నపల్లి వద్ద వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు..రామగిరి మండలం కుంటిమద్దికి చెందిన రమేష్ అనే వ్యక్తి చెన్నేకొత్తపల్లి మండలం చిన్నపల్లి గ్రామ సమీపంలో మట్టిని తరలించేందుకు ట్రాక్టర్, జేసీబీతో వచ్చాడు. ఈ భూమి తమకు పట్టా ఉందని ఇందులో మట్టిని తవ్వరాదని చంద్రశేఖర్, ఆంజనేయులు రమేష్‌కు తెలిపారు. అయినా వినకుండా మట్టిని తవ్వే ప్రయత్నం చేయగా ఒకరిపై ఒకరు దూషణలకు దిగి దాడి చేసుకున్నారు. ఇందులో రమేష్‌కు గాయాలయ్యాయి. జేసీబీ అద్దాలు పగిలినట్లు పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చంద్రశేఖర్, ఆంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నల్లచెరువు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ అలేఖ్య పేర్కొన్నారు. దేవిరెడ్డిపల్లి వద్ద నున్న ఆదర్శ పాఠశాల– హాస్టల్లో మంగళవారం డాక్టర్ అలేఖ్య తమ సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్లో వంట గది పరిసరాలను పరిశీలించారు. వంట నిర్వాహకులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులు అనారోగ్యం బారిన పడితే ఆస్పత్రికి తీసుకురావాలన్నారు.కార్యక్రమంలో సీహెచ్‌ఓ రామచంద్రారెడ్డి, హాస్టల్ వార్డెన్ అనీల, హెల్త్ అసిస్టెంట్ ముస్తఫా, ఎంఎల్‌హెచ్‌పీ హరిత, సూపర్‌వైజర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ కమిటీ ఎన్నిక

నల్లచెరువు: అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నల్లచెరువు ప్రాజెక్టు కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా రాజేశ్వరి, కార్యదర్శిగా భాగ్యమ్మ, కోశాధికారిగా సుజాత, కమిటీ సభ్యులుగా అరుణ, సరస్వతి, పద్మ, నాగలక్ష్మి, భారతి, కృష్ణవేణి, అనూష ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాబున్నీసా, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీఎల్ నరసింహులు, నాయకులు బాబ్జాన్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలునికి తీవ్ర గాయాలు

తలుపుల : మండల కేంద్రంలోని గ్రామీణ బ్యాంకు ఎదుట మంగళవారం ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో జస్వంత్ అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108లో కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ప్రమాదానికి కారణమైన ద్విచక్రవాహనదారుడు సత్యయాదవ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సీపీఐ మండల కన్వీనర్‌గా లక్ష్మీనారాయణ

తాడిమర్రి: సీపీఐ మండల కన్వీనర్‌గా బి.కె.లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. మంగళవారం ధర్మవరంలో జరిగిన నియోజకవర్గస్థాయి సమావేశంలో లక్ష్మీనారాయణను తాడిమర్రి మండల కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సంక్షిప్త సమాచారం

స్వకులసాలి సంఘం గౌరవాధ్యక్షుడిగా నాగరాజు



నాగరాజు

ధర్మవరం: రాష్ట్ర స్వకులసాలి సంఘం గౌరవాధ్యక్షునిగా ధర్మవరానికి చెందిన డిజైనర్ జుజారె నాగరాజును నియమించారు. మంగళవారం అనంతపురంలోని అంబా భవాని కల్యాణ మండపంలో జరిగిన స్వకులసాలి కులస్తుల సమావేశంలో జుజారె నాగరాజును రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు కాంలే నగేష్, జిల్లా అధ్యక్షుడు సరోదే రాజేంద్రప్రసాద్‌లు తీర్మానం చేశారు. అనంతరం ఆయనను సన్మానించారు. నాగరాజును ధర్మవరం స్వకులసాలి సంఘం కమిటీ సభ్యులు సరోదే కృష్ణమూర్తి, జిందే శివశంకర్, సరోదే భుజంగరావు, కాంలే లక్ష్మణ్, చిల్లాలే నాగరాజు, జుజారె ఈశ్వర్, జయప్రకాష్ తదితరులు అభినందించారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె తాత్కాలిక వాయిదా

ధర్మవరం: మున్సిపల్ అవుట్ సోర్సింగ్ ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులు చేస్తున్న సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేశారు. ఈ మేరకు సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కోకన్వీనర్ అయుబ్‌ఖాన్, యూనియన్ అధ్యక్షులు బొగ్గు నాగరాజు, కార్యదర్శి జయకృష్ణ మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ 27 రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులతో మంత్రి నారాయణ విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర నాయకులతో చర్చించారన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రితో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సెక్షన్ యూనియన్ నాయకులు యోగేష్, గాలి శీనా తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ' అమలు చేయండి

ముదిగుబ్బ: అన్నదాత సుఖీభవ పథకాన్ని వెంటనే అమలు చేసి రైతుల ఖాతాలలోకి సొమ్ము జమ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బాసినేని ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.